క్లుప్తంగా

పకడ్బందీగా ఆన్‌లైన్ నమోదు

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: తప్పులు లేకుండా ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తులోని కుటుంబ సభ్యుల పేర్లు, ఆరు గ్యారంటీల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. వచ్చిన 8,355 దరఖాస్తులలో సుమారు 4 వేల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఎల్లమ్మకు విశేష పూజలు



గర్భాలయంలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి ఇష్టమైన మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. బోనం నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజరులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీకి శుభాకాంక్షలు



దీపాదాస్ మున్షీని సత్కరిస్తున్న రవికుమార్

పహాడీషరీఫ్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీకి పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మన్న రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గాంధీభవన్‌లో మంగళవారం ఆమెను కలిసి శాలువా కప్పి పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో చేనేత విభాగం నాయకులు వరలక్ష్మీ, శ్రీనివాస్, పాండురంగ, నరేందర్, నరసింగ్, అశోక్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా

ఆపన్నహస్తం అందించిన పహాడీషరీఫ్ పోలీసులు



నగదు అందజేస్తున్న పోలీసులు

పహాడీషరీఫ్: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అండగా నిలిచి పహాడీషరీఫ్ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. గత నెలలో మృతి చెందిన సదానందం అనే కానిస్టేబుల్ కుటుంబానికి తోడ్పాటు నివ్వాలని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది విరాళాలుగా రూ.1.70 లక్షలను జమ చేశారు. మంగళవారం నగదును మృతుడి భార్యకు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాస్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు సహకారం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



విద్యారణ్య భారతి స్వామిజీతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కొనకట్ట వద్ద ఉన్న శ్రీ హరిహర అఖండ క్షేత్రంలో 108 అడుగుల హనుమాన్ విగ్రహ సంకల్పానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. విద్యారణ్య భారతి స్వామీజీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన పవనమాన హోమం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మట్లాడుతూ.. హరిహర అఖండ క్షేత్రంలో వెలిసే హనుమాన్ విగ్రహం రాష్ట్రంలోనే ఒక గొప్ప క్షేత్రం కావాలన్నారు. అందుకు పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఈ ఆలయ పరిసరాల్లోని ప్రభుత్వ భూమిని ఈ క్షేత్ర అవసరాల కోసం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యారణ్య భారతి స్వామీజీ మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి ఎక్కడ ఉంటే అక్కడ అంతా శుభమే కలుగుతుందన్నారు. మార్చి 30న హనుమాన్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ క్షేత్ర సమితి వ్యవస్థాపకులు సదా వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్, చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



కంకర తేలి ఇరువైపులా ముళ్లపొదలతో పులిమామిడి-కోళ్లపడకల్ రోడ్డు



పులిమామిడి సమీపంలో గుంతలమయంగా మారిన రహదారి

అధ్వాన రహదారి స్థానికుల పాలిట శాపంగా మారింది. కంకర తేలి గుంతలమయమైన దారిలో తట్టెడు మట్టి పోసే నాథుడే కరువయ్యారు. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఛిద్రమైన రోడ్డులో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

- అభివృద్ధికి నోచుకోని పులిమామిడి–కోళ్లపడకల్ రహదారి
- గుంతలతో అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కందుకూరు: ఏళ్ల తరబడి రహదారిని అభివృద్ధి చేయకపోవడంతో రైతులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంకర తేలి గుంతలమయంగా మారిన రహదారిపై ప్రయాణించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదీ మండల పరిధిలోని పులిమామిడి–మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామాలను కలిపే లింకు రహదారి దుస్థితి. రోడ్డును అభివృద్ధి పరిస్తే షాద్‌నగర్, శంషాబాద్, బెంగళూరు హైవేకు చేరుకోవడానికి మండల వాసులకు సులభతరమవుతుంది. ప్రభుత్వం మాత్రం ఆరు కిలోమీటర్ల మేర ఉన్న రహదారిని కేవలం ఒక కిలోమీటర్ లోపే బీటీ నిర్మించి వదిలేసింది. దీంతో సమస్య అదే విధంగా నెలకొంది.

పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

మండల పరిధిలోని పులిమామిడి నుంచి మహేశ్వరం మండలం కోళ్లపడకల్ మధ్య ఉన్న రహదారిని అభివృద్ధి పరిస్తే చుట్టు పక్కల గ్రామాల వారితో పాటు ఆ రహదారి వెంట ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం మాత్రం పులిమామిడి నుంచి కేవలం కిలోమీటర్ లోపు రూ.15 లక్షలు వెచ్చించి 2015లో బీటీ రహదారిని నిర్మించింది. కోళ్లపడకల్ నుంచి పులిమామిడి వైపు దాదాపు ఒక కిలోమీటర్ వరకు రోడ్డు బాగానే ఉంది. మధ్యలో ఉన్న నాలుగు కిలోమీటర్లు పూర్తిగా పాడయింది. కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో అటు ప్రయాణించే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ మధ్యలో అటవీ భూములు కారణం చూపుతూ ఎవరూ పట్టించుకోవడం లేదు. అటవీ అధికారులు మాత్రం పూర్తిగా రహదారి అటవీ భూముల్లోనే ఉందంటూ తరచూ కందకాలు తవ్వి రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంటారు. దీంతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు.

12 కిలోమీటర్ల దూరం

రహదారిని అభివృద్ధి పరిస్తే షాద్‌నగర్, శంషాబాద్ వైపునకు వెళ్లడానికి చాలా దగ్గర అవుతుంది. లేకపోతే చిప్పలపల్లి, మహేశ్వరం లేదా ఇతర మార్గాల్లో వెళ్లాలంటే అదనంగా మరో 12 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గతంలోనే ప్రతిపాదనలు

గతంలో మూడేళ్ల క్రితం రహదారి నిర్మాణానికి నిధుల కోసం అప్పటి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అటవీ శాఖ అధికారుల దృష్టికి సైతం విషయాన్ని తీసుకెళ్లాం. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– సతీశ్‌కుమార్, ఏఈ పీఆర్

జల్‌పల్లిలో కొత్త రేషన్ దుకాణాలు

పహాడీషరీఫ్: ఎట్టకేలకు జల్‌పల్లి మున్సిపాలిటీలో కొత్త రేషన్ దుకాణాలు కొలువుదీరాయి. అరకొరగా ఉన్న చౌక ధరల దుకాణాల వద్ద గతంలో ప్రజలు బారులు తీరుతూ ఇబ్బందులు పడేవారు. ఒక్కో రేషన్ దుకాణానికి వేల సంఖ్యలో కార్డుదారులు ఉండడం.. సరుకులు తీసుకోవడానికి ఆయా షాప్‌ల వద్ద నాలుగైదు కిలోమీటర్లు తిరగాల్సి వస్తున్న నేపథ్యంలో అధికారులు నూతన రేషన్ దుకాణాలు మంజూరు చేశారు. తాజాగా శ్రీరాం కాలనీ, వాదే ముస్తఫా బస్తీలో కొత్తగా దుకాణాలు ఏర్పడ్డాయి. బాలాపూర్ గ్రామంలోని రేషన్ దుకాణానికి అనుసంధానంగా లబ్ధిదారులకు సౌకర్యవంతంగా ఉండేందుకు షాహిన్‌నగర్‌లో దుకాణాలను ఏర్పాటు చేశారు. దీన్ని మంగళవారం జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కౌన్సిలర్లు శంషూద్దీన్, షేక్ ఫమిదా అఫ్జల్, మాజీ వైస్ ఎంపీపీ ఉమర్ బామ్, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ షాపును ప్రారంభిస్తున్న చైర్మన్ అబ్దుల్లా

వైభవంగా చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న పండితులు



పూజా క్రతువులో వేద బ్రాహ్మణులు, గురూజీ

శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో ప్రత్యేక పూజలు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో సహస్ర చండీ మహాయాగాన్ని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 52 మంది వేద బ్రాహ్మణులతో సహస్ర చండీ పారాయణాన్ని చేపట్టారు. అందులో భాగంగా పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సహస్ర గణపతి హోమం, రుద్ర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీనిఖిలేశ్వరానందస్వామి నవగ్రహాలు, గణపతి, మహాకాళీ, మహాచండీ, దేవతా మూర్తులు తదితర విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేర రహిత సమాజానికి సహకరించాలి

ఫుట్ పెట్రోలింగ్‌కు శ్రీకారం

పహాడీషరీఫ్: నేరాల నివారణ కోసం బాలాపూర్ పోలీసులు ఫుట్ పెట్రోలింగ్‌కు శ్రీకారం చుట్టారు. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై యూసుఫ్ జానీ, పెట్రోలింగ్ మొబైల్, బీసీ–4 సిబ్బందితో కలిసి మంగళవారం షాహిన్‌నగర్ పరిసరాలలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమై నేరాలు, శాంతి భద్రతలకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అసాంఘిక శక్తుల కదలికలపై ఆరా తీశారు. అనంతరం తూర్ కాలనీలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు యూనిఫారం ధరించని పోలీస్‌గానే భావించాలన్నారు. నేర రహిత సమాజం కోసం పోలీసులకు సహకరించాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు ఇక్బాల్ బిన్ ఖలీఫా తదితరులు పాల్గొన్నారు.



తూర్ కాలనీలో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి

ఊరెళ్లే వాళ్లు జాగ్రత్తలు పాటించాలి: ఏసీపీ

హస్తినాపురం: నగరం నుంచి సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లే వారు విలువైన వస్తువులను, నగదును ఇంట్లో పెట్టకుండా బ్యాంకు లాకర్లలో లేదా బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని వనస్థలిపురం ఏసీపీ ఎస్.భీంరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఉద్దేశించిన ప్రచార ఆటోను మంగళవారం సీఐ వెంకట్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ భీంరెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగకు ఊరెళ్లే సమయంలో వీలైనంతవరకు ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లెం పెట్టవద్దన్నారు. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచాలని, బయట గేటుకు లోపల నుంచి తాళం వేయాలని సూచించారు. ఇంట్లోని ముందు గదిలో లైటువేసి ఉంచాలని, పేపర్‌బాయ్‌ని, పాలు పోసే వాళ్లకు తాము ఊరు నుంచి వచ్చే వరకు రావద్దని సమాచారం ఇవ్వాలన్నారు. ఇంట్లోని బీరువాలో ఎట్టి పరిస్థితుల్లో నగదు, విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఉంచవద్దన్నారు. ఊరుకు వెళ్తున్న విషయంపై ముందుగా మీ సమీప బంధువులకు, మిత్రులకు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ వెల్లడించారు. కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ బి.వెంకట్, ఎస్‌ఐలు జగన్, మాధవరెడ్డి పాల్గొన్నారు.



ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఏసీపీ భీంరెడ్డి

దివ్యాంగుల సంక్షేమ భవనం ప్రారంభం



దివ్యాంగుల సంక్షేమ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఉన్న మర్రి లక్ష్మమ్మ వెంచర్‌లో రూ.25 లక్షలతో నిర్మించిన దివ్యాంగుల సంక్షేమ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాతారెడ్డి హాజరయ్యారు. దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని వారు తెలిపారు. దివ్యాంగులను గుర్తించి భవనాన్ని నిర్మించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్ శ్రీధర్‌రెడ్డి, పలు డివిజన్ల కార్పొరేటర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్‌తో ఆదివాసీల అభ్యున్నతి

తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ రామకృష్ణ

కడ్తాల్: చెంచు, ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్(ప్రధానమంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ్ అభియాన్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లితో పాటు, పలు చెంచు కాలనీల్లో ఆయా చెంచు కుటుంబాలతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్‌మన్ పథకంలోని 11 రకాల లాభాలను వివరించారు. సురక్షిత మంచినీరు, వృత్తి నైపుణ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, ఎన్ఆర్ఈజీఎస్ జాబ్‌కార్డులు, కుల సర్టిఫికెట్ మొదలైన కనీస సౌకర్యాలు కల్పించడం కొరకు అవగాహన సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలను చెంచులు సద్వియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ, ఏపీఎం రామేశ్వరి, మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



చెంచులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం పీఆర్‌టీయూ టీఎస్–2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతమ్మ, సంఘం నాయకులు కిశోర్‌కుమార్,లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

హస్తినాపురం: ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలలో ముందుండాలని హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల మధుసూదన్‌గుప్తా అన్నారు. సంఘం 2024 నూతన సంవత్సరం కేలండర్‌ను మంగళవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్ గుప్తా మాట్లాడుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పాటు, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిజాల వేణుగుప్తా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జాపాలలో పశువైద్య శిబిరం

మంచాల: మంచాల మండల పరిధిలోని జాపాలలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 45 పాడి పశువులకు కృత్రిమ గర్భనిర్ధారణ పరీక్షలు చేశారు. మరో పది పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో జాపాల సర్పంచ్ నాహిదా బేగం, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లప్ప, మంచాల, ఆరుట్ల, కొంగర కలాన్ పశువైద్యశాల వైద్యులు సుధారెడ్డి, వి.నాగమణి, సురేందర్, వీఎల్ఓలు కృష్ణ, వీరారెడ్డి, గోపాల మిత్రులు బాబురావు, శ్రీను, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపు ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లికి నూతనంగా మంజూరైన రేషన్‌షాపును మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్, కౌన్సిలర్ కమటం రాధమ్మ ప్రారంభించారు. రేషన్ సరుకులను సకాలంలో, సక్రమంగా అందించాలని సూచించారు. రేషన్ డీలర్ మాధవి, మాజీ ఎంపీపీ ధనుంజయ, స్థానిక నాయకులు కమటం వెంకటయ్య, శ్రీపాల్, అనంతరాములు, యాదగిరి, కిష్టయ్య, మహేశ్, రవి, భాస్కర్, నరేశ్, శివ, నిరంజన్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

సర్పంచ్ రవీందర్

కడ్తాల్: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని సర్పంచ్ రవీందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లిలోని క్రీడాకారులకు, యువకులకు ప్రభుత్వం నుంచి మంజూరైన వాలీబాల్, క్రికెట్ కిట్లను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సర్పంచ్ అందజేశారు. ప్రభుత్వం అందజేసిన కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్, నాయకులు.. శ్రీశైలం, చెన్నయ్య, రహీమ్, ఈదమయ్య, జంగయ్య, వెంకటేశ్, శేఖర్, జంగయ్య, చెన్నయ్య ఉన్నారు.

కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా



శ్రీపురం కాలనీ ఫేజ్- 2లో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ ఫేజ్–2 కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కాలనీలో నెలకొన్న విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి సమస్యలను ఆయన దృష్టికి తసుకొచ్చారు.అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా కాలనీలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీని ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఏఈలు రాకేష్, రణధీర్, రవీందర్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, బొమ్మ రఘురాంనేత, విష్ణువర్ధన్, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిక్షాలోనే వేయాలి...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దుకాణదారులకు అవగాహన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేయాలని సూచించారు.చెత్తను చెత్త రిక్షాలలోనే వేయాలని, బయట ఎక్కడా వేయకూడదని తెలిపారు.

ఆలయ భూములకు కంచె ఏర్పాటు

- పనులను పర్యవేక్షించిన దేవాదాయ శాఖ అధికారులు
- అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుంటామని వెల్లడి

కడ్తాల్: ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా దేవాదాయ శాఖ అధికారులు రక్షణ చర్యలు ప్రారంభించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన భూములు మండల కేంద్రంలో సర్వే నంబర్ 76లో 6.05 ఎకరాలు, మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో సర్వేనంబర్ 130లో 3.06 ఎకరాలు, సర్వేనంబర్ 120లో 15.31 ఎకరాలు, సర్వేనంబర్ 125లో 9.32 ఎకరాల భూములు ఉన్నాయి. కాగా ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని గతంలో ఆరోపణలు రావడంతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ భూములకు ల్యాండ్ ఏడీ ద్వారా సర్వే చేయించారు. ఈమేరకు ప్రజాప్రతినిధులతో కలిసి దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం ఆలయ భూములకు కంచె ఏర్పాటు పనులను ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఈఓ మోహన్‌రావు, మండల ఇన్‌చార్జి ఈఓ స్నేహలత, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్ ఈ పనులను పర్యవేక్షించారు.

ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటాం..

దేవాదాయ శాఖ ఈఓ మోహన్‌రావు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 120లో అక్రమణకు గురైన 1.28 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా సర్వే నెంబర్ 120లో మరో 26 గుంటల భూమి కూడా అన్యాక్రాంతమైందని.. రెండుమూడు రోజుల్లో సమీప రైతు వ్యవసాయ పొలానికి తిరిగి సర్వే నిర్వహించి అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 130లో 128 గజాల్లో ఒకరు ఇంటి నిర్మాణం చేపట్టారని, అదే విధంగా 222 గజాల్లో అన్మాస్‌పల్లిలో వాటర్‌ట్యాంకు, జీపీ కార్యాలయం, స్కూల్‌ను నిర్మించడం జరిగిందని.. దీనికి సంబంధించి అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి నోటీసులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 125లో కంచె ఏర్పాటు చేస్తుండగా సమీపంలోని ఓ వెంచర్ నిర్వాహకులు అధికారులను, ప్రజాప్రతినిధులను అడ్డుకున్నారు. ఈ భూమి తమదని, దేవాలయ భూమి కాదని అధికారులతో వాదనకు దిగారు. తిరిగి రెండు రోజుల్లో సర్వే చేపడదామని అప్పటివరకు కంచె ఏర్పాటు చేయవద్దని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సరే అని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శాయిరెడ్డి, బాబు, వార్డుసభ్యులు భిక్షపతి, మల్లయ్య,రాజు, రామకృష్ణ, దేవాదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.



కంచె ఏర్పాటు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు